సాక్షి అనంతపురం

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

బుధవారం

సాయంత్రం

ఇఫ్తార్ : 6.34



న్యూస్‌రీల్

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి



కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమైన క్రోధి నామ తెలుగు నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో క్రోధి నామ సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవుని దయతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో జిల్లా సుభిక్షంగా ఉండాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా రామ్మోహన్ శర్మ పంచాగ శ్రవణం చేశారు. ఉరవకొండకు చెందిన సుబ్రహ్మణ్యం శర్మ, ఇద్దరు దేవదాయ శాఖ అర్చకులను కలెక్టర్ సన్మానించారు. అనంతరం కలెక్టర్‌ను ఇంటాక్ సంస్థ జిల్లా కన్వీనర్ రామకుమార్, అదనపు కో–కన్వీనర్ కృష్ణమూర్తి, సభ్యులు సన్మానించారు. ఉగాది పచ్చడిని అందరూ స్వీకరించారు. కార్యక్రమంలో ఆకాశవాణి అధికారి నాగేశ్వరరెడ్డి, పర్యాటక శాఖ ఆర్‌డీ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారి జయకుమార్, జిల్లా దేవదాయ శాఖ అధికారి ఆదిశేషులు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్కేయూకు రూ.31 కోట్లు మంజూరు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.31 కోట్ల బ్లాక్‌గ్రాంట్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఈ నిధులను విడుదల చేశారు. వర్సిటీ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు చెల్లించడానికి వీలుగా బ్లాక్ గ్రాంట్ కేటాయిస్తారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జీతాల చెల్లింపునకు నిధులు విడుదల కావడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

తగ్గని భగభగలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భానుడి భగభగలు తగ్గడం లేదు. మంగళవారం కూడా సూర్య ప్రతాపం కొనసాగింది. దీంతో జిల్లాలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. శెట్టూరులో 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కంబదూరులో 23.8 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 38–40 డిగ్రీల మధ్య కొనసాగాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది. శ్రీసత్యసాయి జిల్లాలో కూడా వేసవితాపం పెరిగింది. పరిగిలో 40.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తనకల్లు, మడకశిరలో 20.3 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ఫాదర్ ఫెర్రర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అన్నేఫెర్రర్, విశాల ఫెర్రర్

బత్తలపల్లి: ఉమ్మడి జిల్లాలో కరువు కాటకాలను, పేదరికాన్ని పారదోలేందుకు కృషి చేసిన ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని మంగళవారం బత్తలపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఫెర్రర్ ఘాట్ వద్ద ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఆస్పత్రి/ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్డీటీ అంటే తమకు సంతృప్తి కరమైన సేవలు అందుతాయనే నమ్మకంతో ఎంతో మంది వస్తున్నారని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. 'స్పందించు సాయం అందించు' కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషకరమన్నారు. దీని ద్వారా చాలా మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అనంతరం బుధవారం అన్నే ఫెర్రర్ పుట్టినరోజు కావడంతో ముందస్తుగానే ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పాల్, ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, ఆస్పత్రి ఇన్‌చార్జ్ హనుమంతరెడ్డి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



అనంతపురం రూరల్ కట్టకిందపల్లిలో ప్రత్యేక అలంకరణలో పోతులయ్య స్వామి



స్వామికి సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న మహిళ

ఉట్టిపడిన తెలుగు సంస్కృతి

ఉగాది సంబరం అంబరమంటింది. క్రోధి నామ సంవత్సరానికి మంగళవారం జిల్లావాసులు ఘన స్వాగతం పలికారు. ఇళ్ల వాకిళ్లకు మామిడి ఆకులు, పూల తోరణాలు కట్టి అందంగా ముస్తాబు చేశారు. ఉదయాన్నే స్నానం చేసి కొత్త దుస్తులు ధరించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి రుచి చూశారు. కుటుంబ సభ్యులతో కలిసి పిండి వంటలను సంతోషంగా ఆరగించారు. ఉగాదిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తెలుగు విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తూ గ్రామీణ క్రీడాపోటీలు, ఉట్లోత్సవాలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్





స్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

మూడు సార్లు.. ముచ్చెమటలు

తనకు ఎదురేలేదని విర్రవీగిన ఆయనకు పెద్దాయన గట్టిదెబ్బే కొట్టారు. దారుణ ఓటమి రుచిచూపించారు. అయితే, అలాంటి వ్యక్తి ఆకస్మిక మరణంతో మళ్లీ తెరమీదికి వచ్చిన ఆయన.. ప్రజలను బురిడీ కొట్టించి మళ్లీ గద్దెనెక్కారు. నమ్మి ఓట్లేసిన పాపానికి నరకం చూపించారు. ఆయన చేతిలో దారుణంగా మోసపోయిన జనం.. తమను అక్కున చేర్చుకున్న పెద్దాయన కుమారుడికి పట్టం కట్టారు. ఆ పెద్దాయన, ఆయన కుమారుడు మరెవరో కాదు దివంగత నేత వైఎస్సార్, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి.

తండ్రీ కొడుకుల దెబ్బ.. చంద్రబాబు అబ్బా

- ఉమ్మడి జిల్లాలో నాలుగు ఎన్నికల్లో మూడు దఫాలు టీడీపీకి పరాభవం
- వైఎస్సార్ హయాంలో రెండు సార్లు దారుణ ఓటమి
- 2019లో వైఎస్ జగన్ సునామీలో కొట్టుకుపోయిన సైకిల్
- వైఎస్సార్ సీపీకే ఉమ్మడి అనంతపురం జిల్లా కంచుకోట అని నిరూపితం
- ప్రస్తుత ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం కానుందని విశ్లేషకుల అంచనా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్ రాజశేఖర రెడ్డి చేతిలో 2004,2009లో ఘోర పరాభవం మూటగట్టుకున్న చంద్రబాబును.. ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా మట్టి కరిపించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బాబుకు చుక్కలు చూపించారు. గతంలో జరిగిన నాలుగు ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. 14 నియోజకవర్గాలున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్ కుటుంబ విశ్వసనీయతకే జనం పట్టం కట్టినట్లు తెలిసిపోతుంది. మాట ఇస్తే దాన్ని నెరవేర్చే వరకూ వెనకడుగు వేయని తత్వం, తమ అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటారన్న నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోవడంతోనే ఇది సాధ్యమైంది. తమకు జిల్లా కంచుకోట అని బాకాలు ఊదే టీడీపీ నాయకుల మాటలను జనం నమ్మడం లేదు.

చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో..

40 ఏళ్ల రాజకీయ చరిత్ర తనదనీ, మూడు దఫాలు ముఖ్యమంత్రి అయ్యానని చెప్పుకునే చంద్రబాబు.. తండ్రీతనయుల చేతిలో దారుణంగా ఓడిపోవడం చరిత్రలో ఒక విచిత్రం. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అధినేతగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంపూర్ణ ఆధిపత్యం సాధించారు. టీడీపీని పరాభవం బాట పట్టించారు. జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టడం, తన హయాంలోనే ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేయడంతోనే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారని రాజకీయ విశ్లేషకులు చెబుతారు.



2019లో సునామీ సృష్టించిన జగన్

ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 2019లో రాజకీయ పెను తుఫాను సంభవించిందంటే ఆశ్చర్యం కలగకమానదు. ఆ ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించింది. ఫ్యాను ధాటికి సైకిల్ గల్లంతైంది. జనహితమే లక్ష్యంగా బరిలోకి దిగిన జగన్ సైన్యం టీడీపీ అభ్యర్థులను మట్టి కరిపించింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి రెండు దఫాలు బాబును కోలుకోలేని దెబ్బతీయగా.. 2019లో జగన్ ఏకంగా చంద్రబాబును రాజకీయంగా వెంటిలేటర్‌పై పడుకోబెట్టినంత పనిచేశారు. ఇక అప్పట్లో గెలిచిన ఇద్దరు టీడీపీ అభ్యర్థులు కూడా అత్తెసరు మెజార్టీతో గట్టెక్కడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో గత నాలుగు ఎన్నికల్లో బలాబలాలు ఇలా..

సంవత్సరం	పార్టీ	సీట్లు
2004	కాంగ్రెస్	08
2009	కాంగ్రెస్	08
2014	టీడీపీ	12
2019	వైఎస్సార్‌సీపీ	12

పాతకథ పునరావృతమే..!

2019 ఫలితాలు ఈ ఎన్నికల్లోనూ పునరావృతమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో పార్టీకి పనిచేసిన వారిని కాదని డబ్బున్న వారికి టికెట్లు ఇవ్వడంతో టీడీపీలో అసమ్మతి జ్వాలలు రగులుతూనే ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. టీడీపీ కేడర్ కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉంది. అభ్యర్థుల ఎంపిక తమ పార్టీకి గుదిబండలా తయారైందని నాయకులు వాపోతున్నారు. ముఖ్యంగా మొన్నటిదాకా తీవ్రంగా విమర్శించిన గుమ్మనూరు జయరామ్‌కు చంద్రబాబు టికెట్ ఇవ్వడంతో కేవలం డబ్బు కోసమే సీటు కేటాయించారన్న విమర్శలు ఆ పార్టీ నేతల నుంచే వెల్లువెత్తుతున్నాయి. కళ్యాణదుర్గం, అనంతపురం, పుట్టపర్తి వంటి నియోజకవర్గాల్లోనూ డబ్బున్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడంతో ద్వితీయ శ్రేణి నాయకులు రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ టీడీపీకి భంగపాటు తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల మస్కట్ రూపకల్పనలో భాగస్వాములు కండి

- ప్రథమ బహుమతి రూ.5 వేలు



ఎన్నికల మస్కట్ పోస్టర్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల మస్కట్ రూపకల్పనలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రధాన పంటలు, జానపద సాహిత్యం ప్రతిబింబించేలా మస్కట్ రూపకల్పన ఉండాలన్నారు. వేరుశనగ, అరటి, నారింజ, పొద్దు తిరుగుడు తదితర ప్రధాన పంటలు, గొర్రెలు, మేకలు, అనంతపురం జానపద సాహిత్యం నుంచి పాత్రలు, ఏదైనా ఇతర ఆకర్షణీయ పాత్రలు ఉపయోగించి ఎన్నికల మస్కట్ రూపొందించవచ్చన్నారు. పోటీల్లో ఎంపికైన మస్కట్‌కు రూ.5 వేల బహుమతి ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు, డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, ఉన్నత, కేజీబీవీ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు, కార్టూనిస్టులు, డ్రాయింగ్, పెయింటింగ్ సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.atpelectionmascot@gmail.com మెయిల్ ఐడీకి పేరు, మొబైల్ నంబర్, చిరునామా నమోదు చేసి ఈనెల 13 లోపు మస్కట్‌లు పంపాల్సి ఉంటుందన్నారు. టాప్ 3 ఎంట్రీలను జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామన్నారు. జిల్లా స్థాయి మూల్యాంకన కమిటీ ద్వారా పరిశీలించి, ఉత్తమంగా ఉన్న మస్కట్ రూపకర్తకు రూ.5 వేల బహుమతి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలు, సందేహాల నివృత్తికి 9177101476 (జిలాన్)కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు.

'ఓటె'త్తించడమే లక్ష్యం

- ఓటు హక్కు వినియోగంపై విస్తృత ప్రచారం
- స్వయంగా కలెక్టర్ రంగంలోకి..

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎక్కడ చూసినా ఎన్నికల కోలాహలం నెలకొంది. రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో వారు చురుగ్గా ప్రచారం చేపడుతున్నారు. ఇదే క్రమంలో ఈ సారి వంద శాతం ఓటింగే లక్ష్యంగా అధికారులు కూడా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఒకవైపు ఎన్నికల ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా కలెక్టర్ వినోద్‌కుమార్ రంగంలోకి దిగి, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడుతున్నారు. భవిష్యత్తును నిర్దేశించే ఓటు హక్కు ఆవశ్యకత తెలియజేస్తున్నారు.

పెరిగిన ఓటర్లు..

జిల్లాలో ఓటర్లు 20,08,795 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరి 22న ప్రచురించిన తుది జాబితా తరువాత ఈనెల 8వ తేదీ నాటికి జిల్లాలో 14,251 మంది ఓటర్లు పెరిగారు. తుది జాబితాలో జిల్లా వ్యాప్తంగా 19,94,544 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుత జాబితా ప్రకారం 20,08,795 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,93,301 మంది, మహిళ ఓటర్లు 10,15,250 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 244 మంది ఉన్నారు. ఇక జిల్లాలో సర్వీసు ఓటర్లు 2,080 మంది, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 121 మంది నమోదయ్యారు.



వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఓటు హక్కు ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

తాడిపత్రిలో అత్యధికంగా..

జిల్లాలో పెరిగిన ఓటర్లను పరిశీలిస్తే తాడిపత్రి నియోజకవర్గంలో అత్యధికంగా 3,605 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత రాయదుర్గంలో 2,632 మంది ఓటర్లు, గుంతకల్లులో 2,246, కళ్యాణదుర్గంలో 1,735 మంది ఓటర్లు పెరిగారు. ఉరవకొండలో 892 మంది, శింగనమలలో 655 మంది, అనంతపురంలో 1,126 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 1,360 మంది ఓటర్లు పెరిగారు. ఇక.. జిల్లాలో 85 ఏళ్ల వయసు పైబడిన ఓటర్లు 9,722 మంది ఉండగా, రాయదుర్గం నియోజకవర్గంలో అత్యధికంగా 1,323 మంది ఉన్నారు. ఉరవకొండలో 1,044 మంది, గుంతకల్లులో 1,442, తాడిపత్రిలో 1,068, శింగనమలలో 1,236, అనంతపురంలో 1,631, కళ్యాణదుర్గంలో 841, రాప్తాడు నియోజకవర్గంలో 1,137 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దివ్యాంగ ఓటర్లు 26,063 మంది ఉన్నారు. వయసు వందేళ్లు పైబడిన ఓటర్లు 20 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

14 వరకూ అవకాశం..

ఓటరు నమోదుకు ఈనెల 14వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. గడువులోగా అందిన దరఖాస్తులను ఈనెల 25 లోగా పరిశీలించి పరిష్కరిస్తారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న 20,08,795 మంది ఓటర్ల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రక్రియ పూర్తయిన తరువాత తుది ఓటర్ల జాబితాకు జత చేస్తారు.

ఓటర్లను ప్రలోభ పెడితే కఠిన చర్యలు

- ఎస్పీ అమిత్ బర్దర్

అనంతపురం: ఓటర్లను ప్రలోభ పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం నగర పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగర పోలీసు స్టేషన్ల పరిధి, భౌగోళిక స్థితిగతులు, క్రిటికల్ పోలీసు స్టేషన్లు, తాజా పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకపరిస్తే ఉపేక్షించరాదని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనపై సకాలంలో చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆరా తీశారు. సమావేశంలో డీఎస్పీ జి. వీర రాఘవ రెడ్డి, సీఐలు రెడ్డప్ప, క్రాంతి కుమార్, ధరణి కిశోర్, ప్రతాప్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తాడిపత్రి అర్బన్: ఎన్నికల వేళ ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశించారు. మంగళవారం తాడిపత్రి మండలంలో సమస్యాత్మక గ్రామాలైన వీరాపురం, గంగాదేవిపల్లి గ్రామాల్లో ఎస్పీ పర్యటించారు. తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



వీరాపురం గ్రామంలో పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను డీఎస్పీ గంగయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడప రోడ్డులోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ప్రశాంత జీవనానికి భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసుల్లో ఇరుక్కుపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, సీఐలు మురళీకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఉన్నారు.



వజ్రకవచ అలంకరణలో ఆంజనేయస్వామి

పవనపుత్రా.. పాహిమాం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటిరోజు పవనపుత్రుడి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నెట్టికంటి ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు గావించారు. అనంతరం వజ్ర కవచాలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ముఖ మండపం వద్ద పంచాంగ శ్రవణం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కసాపురం గ్రామస్తులు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామిని గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ గంగా నిలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



కసాపురంలో ఊరేగుతున్న పవనపుత్రుడు

డబ్బు కారాదు ముప్పు

గత నెల 31న తాడిపత్రిలోని బంగారు వ్యాపారి షేక్ ఖాజీ మస్తాన్‌వలీ నుంచి పోలీసులు రూ.1.31 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారితో పాటు ఇద్దరు మహిళలనూ అదుపులోకి తీసుకున్నారు. తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరుకు పెద్ద మొత్తంలో నగదు తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా పెట్టారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదరీతిలో సంచరిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.31 కోట్ల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల సమాచారంతో ఐటీ అధికారులు రంగప్రవేశం చేశారు. అలాగే వారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు ఎన్నికల వేళ కోకొల్లలుగా చోటు చేసుకుంటున్నాయి. కచ్చితమైన బిల్లులు, సరైన కారణాలు చూపితే మన సొమ్ము భద్రమే. లేకపోతే ఎన్నికల అధికారులు సీజ్ చేసిన తర్వాత విడిపించుకోవడం తలకు మించిన భారమే అవుతుంది.

- ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిందే
- లెక్కా పత్రం లేకుండా చిక్కితే నగదు, సామగ్రి జప్తు తప్పదు
- జప్తుపై ప్రామాణిక కార్యాచరణ
- విడుదలపై జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షణ

అనంతపురం: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించిన గత నెల నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా తనిఖీ బృందాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ భారీగా నగదు, అక్రమ మద్యం వంటివి పట్టుబడుతున్నాయి. ఇళ్లు, హోటళ్ల వంటి వాటిల్లోనూ తనిఖీలు చేపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమకు అవసరాలకు భారీగా నగదు, బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, ఇతర గిఫ్ట్ ఐటమ్స్ తీసుకెళ్లాలనుకుంటే వాటికి సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలి. తనిఖీ అధికారులకు వాటిని చూపి సురక్షితంగా తీసుకెళ్లవచ్చు. లేకపోతే ఆ నగదు, సామగ్రిని అధికారులు తక్షణమే జప్తు చేసేస్తారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదేపదే సూచిస్తున్నారు.

రూ.10 లక్షలు దాటితే ఆదాయపు పన్ను శాఖకు సిఫార్సు:

నగదుకు సంబంధించి అన్ని ఆధారాలు, బిల్లులు సక్రమంగా ఉన్నప్పటికీ రూ.10 లక్షలు కంటే ఎక్కువ సొమ్ము తరలిస్తుంటే మాత్రం వివరాలను వెంటనే ఆదాయపన్ను శాఖ నోడల్ అధికారికి జిల్లా స్థాయి కమిటీ సమాచారం అందిస్తుంది. దీంతో సంబంధిత వ్యక్తులకు ఆ శాఖ నోటీసులు జారీ చేస్తుంది. వివరణ సంతృప్తికరంగా ఉంటే ఇబ్బంది లేదు. లేకుంటే లెక్క ప్రకారం ఆదాయపు పన్ను మినహాయించి తిరిగి అప్పగిస్తారు. ఎన్నికల నిబంధన ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు తరలిస్తూ తనిఖీ బృందాలకు చిక్కితే పత్రాలు సరిగ్గా ఉండి, ఆ డబ్బు ఎన్నికల వ్యవహారంతో సంబంధం లేదని నిర్ధారించుకున్న తర్వాత స్థానిక రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా దీనిపై జిల్లా స్థాయి కమిటీ సుమోటోగా విచారణ జరుపుతుంది.



ప్రామాణిక కార్యాచరణ విధానం

ఆధారాలు సక్రమంగా ఉన్నా... పట్టుబడిన నగదు, బంగారు, సామగ్రిని వదిలివేయడంపై క్షేత్రస్థాయి అధికారులే నిర్ణయం తీసుకోవడం కుదరదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇందు కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా జిల్లా స్థాయి కమిటీని నియమించింది. క్షేత్రస్థాయి తనిఖీ బృందాలు పెద్ద ఎత్తున డబ్బు పట్టుకున్నా ఆధారాలు సరిగా ఉన్నప్పటికీ దానిని వదిలేయకుండా విషయాన్ని తప్పనిసరిగా జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి. అనంతరం ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) అమలు చేస్తున్నారు. పట్టుబడిన నగదు, సామగ్రి విడుదల, జప్తు వంటి అంశాలపై అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ ఎన్నికలకు నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటుంది.

ఓటరును ప్రలోభ పెడితే శిక్ష



హిందూపురం టౌన్: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. చేసిన నేరాన్ని బట్టి ఆయా చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 భారత శిక్షాస్మృతి చట్టాల కింద నమోదయ్యే ఈ కేసుల్లో నేరం రుజువైతే జరిమానా లేదా జరిమానాతో పాటు జైలు శిక్షనూ అనుభవించాల్సి ఉంటుంది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అంశంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. ఓటర్లను ఒత్తిడికి గురి చేయడం, బెదిరించడం తీవ్రమైన నేరం. ఇలా చేసినట్లు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171 (సీ) చట్టం కింద కేసు నమోదవుతుంది. ఓటర్లకు మద్యం పంపిణీ చేసేందుకు భారీ మోతాదులో రవాణా చేస్తూ పట్టుబడితే అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 24 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికిగాను ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధిస్తారు. డబ్బు పంపిణీ చేస్తే ఐపీసీ 171 (హెచ్) కింద, మద్యం, ఇతర కానుకలు పంపిణీ చేసినా, అన్నదానాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినా నిబంధనలు ఉల్లంఘించినా ఐపీసీ 171 (ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు. ఖర్చుల వివరాలు చూపకుంటే ఐపీసీ 171 (ఐ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. ఓట్ల కోసం కులం, మతం, ఓ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయడం, ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరచడములాంటివి చేస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదు చేస్తారు. లేనిది ఉన్నట్లు ప్రచారం చేస్తే ఐపీసీ 171 (జీ) కింద కేసు నమోదవుతుంది. అభ్యర్థులకు కేటాయించిన సమయానికి మించి వాడుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా మైకులు, ప్రచార సామగ్రి వినియోగిస్తే ఐపీసీ 171 (ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు.

క్లుప్తంగా

వేడి నీళ్లు పడి బాలునికి గాయాలు

గుత్తి: వేడినీళ్లు కాళ్ల మీదపడి ఓ బాలుడికి గాయాలయ్యాయి. వివరాలు... స్థానిక దాసరి కాలనీలో నివాసముంటున్న రామాంజినేయులు, రమణమ్మ దంపతుల పదహారేళ్ల వయసున్న కుమారుడు నారాయణస్వామి మంగళవారం పొయ్యి మీద ఉన్న నీళ్లు చల్లవని భావించి కాళ్లు కడుకున్నాడు. అప్పటికే సలసల కాగుతున్న ఆ నీళ్ల ప్రభావంతో కాళ్లు కాలిపోయి బొబ్బలు తేలాయి. బాలుడి కేకలు విన్న తల్లిదండ్రులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు.

నాయనపల్లి క్రాస్‌లో చోరీ

- ఇంటికి తాళం పగలగొట్టి రూ.5లక్షలు, 5 తులాల బంగారు నెక్లెస్ చోరీ

శింగనమల: మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో నివాసముంటున్న కమలమ్మ ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు చొరబడి బీరువాలోని రూ.5 లక్షలు నగదు, 5 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. సోమవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం కమలమ్మ ఇంటికి తాళం వేసి మిద్దెపై పడుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న చౌడేశ్వరీదేవి రథోత్సవం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి బ్రహ్మ రథోత్సవం మంగళవారం అశేష భక్తజనం మధ్య వైభవంగా జరిగింది. ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు దేవాలయం చుట్టూ ఊరేగింపు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని బ్రహ్మరథోత్సవం వద్దకు తీసుకు వచ్చి మహా మంగళ హారతి ఇచ్చారు. దేవాలయం నుంచి గ్రామంలోని పంచాయతీ ఆవరణలోని ఆంజనేయస్వామి దేవాలయం వరకూ రథోత్సవం సాగింది. భక్తులకు అన్నదానం, పానకం, పెసరబ్యాళ్లు, మజ్జిగను పంపిణీ చేశారు.



ఉయ్యాల ఉత్సవంలో ఖాద్రీశుడు

వర్షాలు సకాలంలో కురుస్తాయి...

కదిరి టౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పంచాంగ పఠనం నిర్వహించారు. వేదపండితుడు సుబ్రహ్మణ్యశర్మ పంచాగ పఠనం కావిస్తూ వివిధ రాశుల సంచారం, నవగ్రహ ఫలితాలను వివరించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. నూతన తెలుగు సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. కాగా, ఆలయంలో మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న సుబ్రహ్మణ్యం శర్మ

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్‌లో ఉచితంగా కోర్సు అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేకుంటే 98660 06662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకూ కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

మహిళపై దాడి

తలుపుల: తీసుకున్న రూ. లక్ష అప్పు తీర్చమన్నందుకు తలుపుల మండలం ఉడమలకుర్తికి చెందిన నాగార్జున భార్య గౌతమిపై రామాంజులు దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్లె సంబరం

గార్లదిన్నె: నిజమైన పండుగ వాతావరణం పల్లెల్లోనే కనబడుతుందని పెద్దలు అంటుంటారు. అలాంటి పండుగ సంబరం మంగళవారం గార్లదిన్నె మండలం కల్లూరులో ఎంతో ఉత్సాహంగా సాగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో కొండకింద కొట్టాల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద యువకులకు 120 కిలోల ఇసుక బస్తాలను ఎత్తే పోటీలు నిర్వహించారు. ఆరంభం నుంచే యువకులు పోటాపోటీగా తలపడడంతో ఈలలు, చప్పట్లు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పోటీల్లో పాల్తూరుకు చెందిన రాజు, రవి వరుసగా మొదటి, మూడో స్థానం దక్కించుకోగా, రెండో స్థానంలో కల్లూరు అగ్రహారానికి చెందిన సుధాకర్, నాల్గో స్థానంలో చిత్రచేడు నివాసి సుధాకర్ నిలిచారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో గ్రామస్తులు సత్కరించారు.



ఇసుక మూట పైకి ఎత్తుతున్న యువకుడు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న గ్రామస్తులు

ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రామ్‌నగర్ జిల్లా చిన్నపట్నం నివాసి అప్సర్ (38) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి టెంకాయల లోడుతో తుమకూరు మడకశిర మీదుగా నాగపూర్‌కు బయలుదేరిన ఆయన మంగళవారం తెల్లవారుజాము 3 గంటలకు పెనుకొండ సమీపంలోని రాజేశ్వరీ కాలనీ వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న రైల్వే అండర్‌పాస్ వద్ద బ్రిడ్జిని ఢీకొన్నాడు. ఘటనలో అప్సర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన క్లీనర్ పర్వాస్‌ను స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మృతుడు అప్సర్

వడదెబ్బ సోకకుండా పశువులను కాపాడుకోవాలి

- ఉరవకొండ పశువసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్

ఉరవకొండ: తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బ సోకి పశువులు మృత్యువాత పడే ప్రమాదముందని పాడిరైతులను ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేష్ హెచ్చరించారు. మంగళవారం పలు గ్రామాల్లో వడదెబ్బ సోకిన పశువులను ఆయన పరిశీలించారు. వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. సాధారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రత 99 నుంచి 100 డిగ్రీల వరకు ఉంటుందన్నారు. దీనికి మించి ఉన్నప్పుడు శరీర ప్రక్రియ మందగించి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయన్నారు. ఆవులతో పోల్చుకుంటే గేదెల్లో వడదెబ్బకు లోనయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. వడదెబ్బ ప్రభావంతో పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుందన్నారు. మరికొన్ని సందర్భాల్లో మృత్యువాత పడే ప్రమాదమూ ఉందని హెచ్చరించారు. వీలైనంత వరకు ఉదయం 10 గంటల్లోపు, తిరిగి సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే పశువులను మేపు కోసం బయటకు తోలుకెళ్లాలని సూచించారు. పాకలు, కొట్టాలు లేని వారు చెట్ల కింద పశువులను కట్టి ఉంచాలన్నారు. తగినంత పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి పశువుకూ రోజుకు 60 నుంచి 70 లీటర్ల నీరు అందించాలన్నారు. ఎక్కువగా పచ్చిమేత అందించి దాణా తడిపి ఇవ్వడం వల్ల పశువులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటాయన్నారు.



జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ వెంకటేష్

మందుబాబుల వీరంగం


అనంతపురం: నగర శివారులోని బళ్లారి బైపాస్ రోడ్డులో ఉన్న అమృత్ బార్‌లో మందుబాబులు వీరంగం చేశారు. విచక్షణారహితంగా ఓ వ్యక్తిపై దాడికి తెగబడ్డారు. వివరాలు.. నందమూరి నగర్‌కు చెందిన మహేష్, శశికిరణ్ స్నేహితులు. వీరితో పాటు మరికొందరు స్నేహితులు కలసి మంగళవారం రాత్రి అమృత్‌బార్‌లో మద్యం సేవించారు. కాస్త మత్తెక్కిన తర్వాత మాటామాట పెరగడంతో గ్యాంగ్‌వార్‌కు తెరతీసింది. మద్యం సీసాలతో కొట్టుకున్నారు. మహేష్ దాడిలో శశికిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని ఐదో రోడ్డు, ఆరో రోడ్డుకు చెందిన వ్యక్తులు ఈ వివాదానికి కారకులని తెలుస్తోంది. నాలుగో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని వివాదానికి దారితీసిన కారణాలను ఆరా తీస్తున్నారు. తాగిన మైకంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదమా? లేక ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. కాగా, పది నిమిషాల పాటు పరస్పర దాడులు చోటు చేసుకున్నా.. బార్ నిర్వాహకులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను అడ్డుకోకుండా ప్రేక్షకపాత్ర వహించడం విమర్శలకు దారితీస్తోంది. క్షతగాత్రుడు ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

నచ్చకపోతే ఉందిగా నోటా!

- ఎన్నికల్లో తిరస్కరణ ఓటుతో ఓటరుగా హక్కు వినియోగించుకునే అవకాశం
- ఈవీఎంల్లో ప్రత్యేకంగా 'నోటా' బటన్
- అభ్యర్థులెవరూ నచ్చలేదని చెప్పే అవకాశం
- 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకు 26వేల ఓట్లు



హిందూపురం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసేందుకు భారత ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఇందు కోసం ఈవీఎంల్లో అభ్యర్థుల గుర్తులతో పాటు ప్రత్యేకంగా 'నోటా'(నన్ ఆఫ్ ది ఎబోవ్) బటన్‌నూ ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఓటు వేయాలంటే సదరు అభ్యర్థి గుర్తు పక్కన నొక్కితే ఓటు నమోదవుతుంది. పోటీలో ఉన్నవాళ్లెవరూ నచ్చకపోతే ఈవీఎం ఆఖర్లో 'నోటా' బటన్ నొక్కితే ఆ ఓటు ఎవరికీ పడదు. కానీ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నమోదవుతుంది.

2013లో అమలులోకి

'నోటా'ను అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు 2009లో సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. అయితే ఈ అంశాన్ని అప్పటి ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. దీంతో ప్రముఖ పౌరహక్కుల సంస్థ పీయూసీఎల్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేసింది. నాలుగు సంవత్సరాల వాదనల అనంతరం నోటాను అమల్లోకి తేవాలంటూ 2013లో రూలింగ్ ఇచ్చింది. ఓటర్లకు ఇష్టం ఉన్నా.. లేకున్నా ఎవరికో ఒకరికి ఓటేసే బదులు అభ్యర్థులందరినీ తిరస్కరిస్తూ నోటాకు ఓటేసే సదుపాయం అప్పటి నుంచి అమల్లోకి వచ్చింది. ఒకవేళ ఓ నియోజకవర్గంలో నిలబడిన అభ్యర్థులకంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే.. ఆ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా..

ఉమ్మడి జిల్లాలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకి 26 వేలకు పైగా ఓట్లు పడ్డాయని అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే పోలింగ్ కేంద్రం వైపు ఓటర్లు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. ఎవరెన్ని చెప్పినా అభ్యర్థి విశ్వసించదగ్గ వ్యక్తి కాదని, అందుకే తాము ఓటు వేయకుండా దూరంగా ఉంటున్నట్లు పేర్కొనేవారు. దీని వల్ల రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు దుర్వినియోగమవుతూ వచ్చేది. చాలా ప్రాంతాల్లో అంగబలమున్న అభ్యర్థులు రిగ్గింగ్‌లకు తెరలేపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వచ్చారు. ఇలాంటి తరుణంలో నోటా ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో ఓటు హక్కు దుర్వినియోగానికి చెక్ పెట్టినట్టైంది. అభ్యర్థి తమకు నచ్చినా... నచ్చకపోయినా ప్రతి ఒక్క ఓటరు నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడం మొదలైంది.

2019లో పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్లు..

అనంతపురం	16,466
హిందూపురం	17,428

ఉమ్మడి జిల్లాలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్లు

నియోజకవర్గం	నోటాకు పడిన ఓట్లు
అనంతపురం	1,312
కళ్యాణదుర్గం	1,515
రాయదుర్గం	3,883
గుంతకల్లు	1,547
ఉరవకొండ	1,517
తాడిపత్రి	2,063
శింగనమల	2,340
మడకశిర	2,656
కదిరి	1,567
ధర్మవరం	1,767
హిందూపురం	1,290
పెనుకొండ	1,553
రాప్తాడు	1,801
పుట్టపర్తి	1,310

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రబోధ సేవా సమితి రూపొందించిన తెలుగు క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఉగాది పండుగ అన్ని వర్గాల ప్రజలకు సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, సభ్యులు రాఘవ, అవినాష్‌రెడ్డి, రామిరెడ్డి, భార్గవ ఆచారి, సత్యానంద ఆచారి, విజయక్క, నాగిరెడ్డి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

గర్ల్స్‌హాస్టల్‌కు స్టీమ్ బాయిలర్ వితరణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని శిల్పా గర్ల్స్ హాస్టల్‌లో స్టీమ్ కుకింగ్ నిమిత్తం నూతన స్టీమ్ బాయిలర్‌ను కళాశాల పూర్వ విద్యార్థి సి.చిరంజీవి (1963–68 బ్యాచ్) తరఫున అందజేశారు. అదే విధంగా ఎల్లోరా హాస్టల్‌లో స్టీమ్ బాయిలర్‌ను మరమ్మతు చేయించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

అనంత వెంకటరామిరెడ్డిని గెలిపించుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ వసీం, నాయకులు

అనంతపురం కల్చరల్: అవినీతి మరకలు లేని స్వచ్ఛమైన నాయకుడు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి గెలిపించి నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని మేయర్ వసీం ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మస్జిద్ ఏ ఫిర్దోస్ పరిసర ప్రాంతాలలో మేయర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి చేసుకున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ నియాజ్, అధికార ప్రతినిధి ఖాజా, కార్పొరేటర్ రహంతుల్లా, నాయకులు మహబూబ్‌బాషా, దాదు, నదీమ్, తానీషా, జావిద్, అల్తాఫ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగిరెడ్డిపల్లిలో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నారాయణపురం పంచాయతీలోని నాగిరెడ్డి పల్లిలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరాయి.

విద్యార్థి చదువుకు చేయూత



విద్యార్థికి చెక్కునందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: విద్యార్థి చదువుకు అమ్మ సంస్థ మరోసారి చేయూతనిచ్చింది. వివరాలు.. నగరంలోని బళ్లారి రోడ్డులో నివాసముంటున్న శివయ్య భార్య లక్ష్మమ్మ, కొడుకులు సాయి, శ్రావణ్‌తో కలిసి నివాసముండేవాడు. ఎలక్ట్రికల్ హెల్పర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. అయితే దురదృష్టవశాత్తు శివయ్య మరణించడంతో బిడ్డలిద్దరినీ వృద్ధిలోకి తేవడానికి తల్లి ఓ బండల ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉంది. ఇటీవల శ్రావణ్ కలికిరి సైనిక్ స్కూల్లో సీటు తెచ్చుకున్నాడు. అయితే అక్కడ అడ్మిషన్ ఫీజు కోసం రూ.1.7 లక్షలు కావాల్సి ఉండడంతో ఇంట్లో ఉన్న బంగారు అమ్మి కొంత డబ్బు జమచేసుకున్నారు. మిగిలినదాని కోసం ఆపన్నహస్తాల కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శ్రావణ్ చదువు కోసం రూ.1 లక్ష ఆ కుటుంబానికి ఇవ్వడమే కాకుండా రూ.25 వేలు విలువ చేసే నిత్యావసరాలను అందించాడు. ప్రతిభ కల్గిన ఏ విద్యార్థి చదువు అర్ధంతరంగా ఆగిపోకూడదన్న ఉద్దేశంతో సాయమందించినట్లు రమణారెడ్డి తెలిపారు. ఆ కుటుంబం అమ్మ సంస్థకు కృతజ్ఞతలు తెలిపింది.

వైభవంగా క్రోధి నామ సంవత్సర వేడుకలు

- గ్రామగ్రామాన అంబరాన్నంటిన ఉగాది సంబరాలు

రాప్తాడు: మండల వ్యాప్తంగా క్రోధి నామ సంవత్సర వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే లేచి తలంటుస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాప్తాడులోని పండమేటి వెంకటరమణస్వామి, నీలకంటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, పెద్దమ్మ, మారేమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఆలయం, హంపాపురంలోని మౌనగిరిక్షేత్రం, పుల్లలరేవు, యర్రగుంట గ్రామాల్లో చెన్నకేశవస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లోని అర్చకులు ఉగాది పర్వదినాన్ని, తెలుగు నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. సాయంత్రం సమయంలో ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది.

భక్తులతో పోటెత్తిన చిన్నకదిరయ్యస్వామి ఆలయం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని మరూరు గ్రామంలోని చిన్నకదిరయ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వేలాది మంది తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మండలంలోని చుట్టూ పక్క గ్రామాలే ప్రజలే కాక యితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. భక్తులు ఆలయం చూట్టూ ఫలహారపు బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలను తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది పండుగ పురస్కరించుకుని చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించడంతో తెలుగు సంప్రదాయాలు ఉట్టి పడ్డాయి.





చెన్నేకొత్తపల్లి మండలం ఒంటికొండలో అక్కదేవతల ఎలవగంపను ఊరేగిస్తున్న దృశ్యం, స్వామివారి ముందు వారపడిన భక్తులు



కట్టకిందపల్లిలో పోతలయ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



అలంకరణలో కొత్తకోట సుంకులమ్మ అమ్మవారు



అలంకరణలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరుడు





కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో పూజలందుకొంటున్న దుర్గమ్మ, గంగమ్మ దేవతలు

చెన్నేకొత్తపల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మేడాపురంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని గుట్ట నుంచి స్వామి ప్రతిమలను తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా తమ కోర్కెలు నెరవేరేందుకు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధులన్ని గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఒంటికొండ గ్రామంలో అక్కదేవతల ఉత్సవాన్ని ఘనంగా జరిగింది. కొత్తచెరువు మండలం నుంచి వచ్చిన అమ్మవారి ఎలవగంపకు గ్రామ సమీపంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. భక్తులు తమ కొర్కెల నెరవేరేందుకు స్వామివారి ముందు మోకరిల్లారు. ఇక ప్యాదిండి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగాది పండుగను పుర స్కరించు కొనద్దాలయంలోని స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వించారు. ఉగాదిని పురస్కరించుకొని గ్రామాల్లో ప్రజలు ఆటపాటల్లో మునిగిపోయారు.

శిల్పారామంలో సంబరాలు..

అనంతపురం రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శిల్పారామంలో మంగళవారం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఏఓ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు పంచాంగ శ్రవణం పఠించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏఓ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా మంగళవారం ఉగాది పండుగ సంబరాలను ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. షడ్రుచులతో ఉగాది పచ్చడితోపాటు పిండి వంటలు చేసుకుని ఆనందంగా పండుగ నిర్వహించారు. మండలంలోని పంపనూరు ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరులోని భైరవేశ్వరుని ఆలయం, అక్కమ్మదేవతలు, అంకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆత్మకూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పంచాంగం చదివి వినిపించారు. అక్కమ్మదేవతల గంపను గ్రామోత్సవం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ఊరూరా ఉగాది సందడి

కనగానపల్లి: ఉగాది సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. తెలుగువారి తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని మంగళవారం రాప్తాడు నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పండుగ సందర్భంగా ప్రతి గ్రామంలోను ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పండుగవేళ ఉదయాన్నే లేచి ఇంటి ముఖద్వారాలకు పచ్చని మామిడి తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. దీంతో పాటు గ్రామాల్లోని రైతులు పంటలు బాగా పండి, మంచి శుభాలు జరగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని పెద్దయ్యస్వామి, ఈశ్వరాలయం, సల్లాపురమ్మ, మామిళ్లపల్లిలోని నరసింహస్వామి, పెద్దమ్మ, దుర్గమ్మ, గంగమ్మ ఆలయాలు, తగరకుంట సీతారామాంజనేయస్వామి, మల్లన్నస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



రాప్తాడులో పండమేటి రాయుడు, శివుడు, నారాయణస్వామి, శ్రీరాముడి ఉత్సవవిగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం





భైరవేశ్వర స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



మొదటి రోడ్డులో పూజలందుకున్న శ్రీరాముడు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితుడు



కార్యక్రమానికి హాజరైన నగరవాసులు

అంబరమంటిన ఉగాది సంబరం

- ఆకట్టుకున్న పంచాంగ శ్రవణాలు

అనంతపురం కల్చరల్: శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ క్రోధి నామ సంవత్సర ఉగాదిని జిల్లా వాసులు సంబరంగా జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనమై వచ్చిన తెలుగు వారి నూతన సంవత్సరాది మంగళవారం నాడు ప్రతి ఇంట ఆనందోత్సాహాలను తెచ్చింది. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో స్వాములకు అభిషేకాలు, అలంకార సేవలతో పాటు సంప్రదాయమైన ఉగాది పచ్చడిని వితరణ చేశారు. పెద్ద ఎత్తున పూజోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. పిండి వంటల దుకాణాల వద్ద జనం బారులు తీరడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి.

శాస్త్రోక్తంగా వేడుకలు..

మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో ఉగాది వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణం చేశారు. రెవెన్యూ కాలనీలోని రామాలయం, పాతూరు దత్తాత్రేయ స్వామి ఆలయం, ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శారదానగర్‌లోని బాలయోగి ఆశ్రమంలో ఉగాది వేడుకలు నయన మనోహరంగా జరిగాయి. కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను వజ్రాల చీరలో భక్తులకు దర్శనమిచ్చింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది ఆనందంగా జరుపుకున్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

లలితకళాపరిషత్తులో ఉగాది వేడుకలు జిల్లా కళాకారులు ఆనందోత్సాహాలనడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాజుల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన, కార్యదర్శి పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం ఆకట్టుకున్నాయి. సాయిట్రస్టు ఆధ్వర్యంలో హరిహరదేవాలయం ప్రాంగణంలో చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణ పోటీలు అలరించాయి. పలు చోట్ల జరిగిన ఉగాది వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఉగాది పచ్చడి స్వీకరించారు.

సుంకులమ్మకు పూజలు

అనంతపురం అర్బన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక చెరువు కట్టపై వెలిసిన కొత్తకోట సుంకులమ్మ అమ్మవారికి పూజారమ్మ బెస్త వరలక్ష్మి విశేష పూజలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఫాదర్ ఫెర్రర్ సేవలు మరువలేనివి

కనగానపల్లి: బలహీన వర్గాల కోసం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని ఆర్డీటీ ఎస్‌టీఎల్‌లు శారదమ్మ, ఎల్లమ్మ తెలిపారు. మంగళవారం మండలవ్యాప్తంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని నిర్వహించారు. ముక్తాపురంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ సంస్థ ప్రతినిధులతో కలసి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ పెర్రర్ సేవలను వారు కొనియాడారు. ఆర్డీటీ మహిళా సంఘాలు స్పందించు-సాయమందించు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. కోనాపురం, వేపకుంట, మద్దులచెరువు, పర్వతదేవరపల్లి, శివపురంలో కూడా ఫాదర్ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో సీఓ రామక్రిష్ణ, పీఎస్‌సీ సభ్యులు నరసింహమూర్తి, లక్ష్మీనరసమ్మ, చెన్నమ్మ, లక్ష్మీదేవి, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.



ముక్తాపురంలో ఫాదర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీటీ సిబ్బంది, మహిళలు

ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. గత 54 ఏళ్ల నుంచి విద్యా రంగంలో ఎన్‌ఎస్‌యూఐ అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగించిందన్నారు. నాయకులు అంజి, నవీన్, ఆది, మహేష్, శీను, వీర, సుధీర్, మౌలా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై రాయితీ

- ఒకే సారి పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేట్

అనంతపురం కార్పొరేషన్: ఇంటి పన్నుపై డిస్కౌంట్(రిబెట్) వచ్చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నును ఒకేసారి చెల్లిస్తే5 శాతం రిబేట్ ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు రాయితీకి అవకాశం ఉంటుందని, అసెస్‌మెంట్‌దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇంటి, ఖాళీ జాగా పన్నుతో అనంతపురం నియోజకవర్గ ప్రజలకు గత నెలలో వడ్డీ మాఫీ వచ్చిన విషయం విదితమే. తద్వారా అసెస్‌మెంట్‌దారులకు రూ.2 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. ఇప్పుడు 5 శాతం రిబేట్ ద్వారా ప్రజలకు మరింత లబ్ధి కలగనుంది.

పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని 1వ సచివాలయం, రాణినగర్‌లోని 3వ సచివాలయం, రెండో రోడ్డులోని 64వ సచివాలయం, అశోక్‌నగర్ హరిహర దేవాలయం సమీపంలో ఉన్న 39వ సచివాలయం, నవోదయ కాలనీలోని 40వ సచివాలయం, రాంనగర్‌లోని 54వ సచివాలయంలో పన్ను చెల్లింపు కౌంటర్లను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పన్ను చెల్లించే సదుపాయం కల్పించారు. అదేవిధంగా సెలవు దినాల్లోనూ పన్ను చెల్లించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనూ క్రెడిట్, డెబిట్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లోనూ పన్ను చెల్లించవచ్చు.

హోమియో.. దుష్ప్రభావం లేదయో!

- హోమియోకు పెరుగుతున్న ఆదరణ
- నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

జిల్లాలో మొత్తం హోమియో వైద్య శాలలు	25
ఇందులో రెగ్యులర్‌వి	12
జాతీయ ఆరోగ్య మిషన్ సారథ్యంలో నడుస్తున్న వైద్యశాలలు	13




పాతూరులోని హోమియో వైద్యశాల

అనంతపురం మెడికల్: సాధారణంగా ఏదైనా జబ్బుకు మందులు తీసుకుంటే దుష్ప్రభావాలుంటాయి. అయితే ఎలాంటి దుష్ప్రభావం(సైడ్ ఎఫెక్ట్) లేని వైద్యం అంటే హోమియో అని చెప్పాలి. రోగి సమస్య నయం కావడానికి పురాతన హోమియో వైద్యం దోహదపడుతుంది. పురాతన హోమియో వైద్యానికి ప్రజల్లో ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది. ప్రపంచ వైద్య రంగంలో హోమియో పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమాన్ హోమియో వైద్య విధానాన్ని కనుగొన్న గొప్ప శాస్త్రవేత్త. తనపై, తన కుటుంబ సభ్యులపై వందకు పైగా పరిశోధనలు, ప్రయోగాలను విజయవంతం చేశారు డాక్టర్ హనేమాన్. ఇవాళ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు హోమియో మందు తీసుకుంటూ మంచి ఆరోగ్యంగా జీవిస్తున్నారు. డాక్టర్ హనేమాన్ జయంతి ఏప్రిల్ 10న ప్రపంచ హోమియో దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

వ్యాధుల నుంచి ముందస్తు రక్షణ..

దేశీయ వైద్యంగా హోమియోను భావిస్తారు. అలోపతి వైద్యంతో మెరుగుపర్చని ఆరోగ్యాన్ని హోమియో వైద్యం ద్వారా నిదానంగా సత్ఫలితాలు వస్తున్నాయి. ఏటా సీజనల్‌గా ప్రజలను ఇబ్బందులకు గురి చేసే మెదడు వాపు, స్వైన్ ఫ్లూ, డెంగీ, చికెన్ గునియా, చికెన్ ఫాక్స్, కండ్ల కలక, విష జ్వరాలు ఇలా ఎన్నో రోగాలు సోకకుండా హోమియో మందు ముందస్తు రక్షణ కల్పిస్తోంది. 1998లో జిల్లాను వణికించిన మెదడు వాపు మహమ్మారిని అదుపు చేసింది హోమియో వైద్యమే. అప్పట్లో 2047 మంది చిన్నారులకు మెదడు వాపుతో ఇబ్బంది పడ్డారు. అప్పట్లో కొందరు పిల్లలు మృత్యువాత పడ్డారు. కానీ చాలా మందికి హోమియోలోని బెల్లడోనా మందు పసిపిల్లల ప్రాణాలను రక్షణ కవచంగా నిలిచింది. 2015లో డెంగీ, 2016లో స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకర జ్వరాలకు హోమియో వైద్యం బాగా పని చేసిందని ఆరోగ్య శాఖ వర్గాలు తెల్పుతున్నాయి.

శాశ్వత చికిత్స



హోమియో మందులతో ఎటువంటి దుష్ప్రభావం ఉండదు. అందరూ మందులు వేసుకునేందుకు మందు తియ్యగా ఉంటుంది. ఒక్కరోజు బిడ్డ నుంచి పండు ముసలి వరకు మానవుని అన్ని దశల్లోనూ అన్ని రకాల జబ్బులకు శాశ్వత చికిత్స ఉంది. హోమియో మందులు వాడడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంచుకుని జబ్బులు రాకుండా చేసుకునే అవకాశం లేకపోలేదు. ప్రతి కుటుంబం హోమియో వైద్యాన్ని అలవాటు చేసుకుని ఆరోగ్యవంతులుగా జీవించాలి.

– డాక్టర్ పోగుల కుమారయ్య (రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

నమ్మకమైన వైద్యం



నమ్మకమైన వైద్యం హోమియో. హోమియో వైద్యం పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు తాత్కాలిక రోగాలను వంద శాతం నయం చేసే ఔషధగుణం కల్గిన వైద్యం. అన్ని రకాల జబ్బులకు హోమియోలో మందులున్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు(సీనియర్ వైద్యాధికారి)